క్లుప్తంగా

రోడ్డు కబ్జాపై చర్యలు తీసుకోవాలి



దాచేపల్లి: మండలంలోని గామలపాడు ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డును కబ్జా చేసిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్‌ను శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామానికి చెందిన వెంకటరమణ, ఎస్సీ కాలానికి వెళ్లే దారిని ఆక్రమించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దారిలో నుంచి కాలానీకి రాకుండా ఇబ్బందులు పెడుతున్నారని వివరించారు. ఎస్సీలు తన ఇంటి మీదుగా నడవటానికి విలులేదని భయపెడుతున్నారని, విచారణ చేసి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. విచారణ చేపడతామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో ఎస్సీ కాలనీ వాసులు పోలే సుధీర్, పత్రా మాణిక్యరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు మాతంగి సత్యానందం, వేల్పుల మహేష్ ఉన్నారు.

మార్కెట్ యార్డు నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల మార్కెట్ యార్డు నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం శుక్రవారం మార్కెట్ యార్డు కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి కార్యదర్శి ఈశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు హాజరయ్యారు. మార్కెట్ యార్డు చైర్మన్‌గా పిడుగురాళ్ల పట్టణానికి చెందిన తురకా వీరాస్వామి, వైస్ చైర్మన్‌గా మాచవరం గ్రామానికి చెందిన షేక్ మీరాసాహెబ్ (అబ్దుల్లా)తో పాటు మార్కెట్ యార్డు డైరెక్టర్లు మొత్తం 20 మందితో ప్రమాణస్వీకారం చేయించారు.

పంచాయతీ వాటర్ వర్క్స్ ఉద్యోగి ఖాసిం మృతి


కారెంపూడి: గ్రామ పంచాయతీ వాటర్ వర్క్స్ ఉద్యోగి షేక్ ఖాసిం(34) శుక్రవారం మృతి చెందారు. గుండెపోటుతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. విషాదఛాయలు అలుముకున్నాయి. అంత్య క్రియల కోసం గ్రామ ఇన్‌చార్జి సర్పంచి బాణావత్ సరస్వతీ బాయి రూ.20 వేలు సాయాన్ని కుటుంబ సభ్యులకు అందించారు.

గాదెవారిపల్లెలో ఎమ్మెల్యే పర్యటన



కారెంపూడి: మండలంలోని గాదెవారిపల్లెలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. వారి కున్న సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గురజాల నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు పంగులూరి అంజయ్య, పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు పంగులూరి పుల్లయ్య, వైస్ ఎంపీపీ గాడిపర్తి రమాదేవి పూర్ణయ్య, పార్టీ నాయకుడు కర్ణా సైదారావు, చప్పిడి రాము పాల్గొన్నారు.

వర్షాల కోసం గ్రామ దేవతలకు జలాభిషేక పూజలు



దొడ్లేరు(క్రోసూరు): వరుణదేవుడు కరుణ కటాక్షాల కోసం మండలంలోని దొడ్లేరు గ్రామ ప్రజలు జలబిందెలతో గ్రామ దేవతలకు జలాభిషేకాలు, పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గంగమ్మతల్లి, పోలేరమ్మతల్లి, శివాలయం, బ్రహ్మంగారి దేవాలయం, తిరుపతమ్మతల్లి, వేంకటేశ్వర స్వామి దేవాలయాలలో రెండు రోజులుగా జలాభిషేక పూజలు చేస్తున్నారు. మూడు రోజుల పాటు జలాభిషేకాలు నిర్వహించి నాల్గవరోజు(ఆదివారం) గంగమ్మతల్లికి పొంగళ్లు పెట్టుకుంటామని భక్తులు చెబుతున్నారు. మండలంలో ఇప్పటి వరకు సరైన వర్షాలు లేక ఒకపక్క రైతులు ఖరీఫ్ సాగుకు, మరో పక్క ప్రజలు గుక్కెడు తాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. జూలై వచ్చినా విత్తనాలు వేయని పరిస్థితిలో రైతన్నలున్నారు. పొలాలు సాగు చేస్తామా, లేదా అనే మీమాంశలో ఉన్నారు. గ్రామ ప్రజలందరూ దేవుడిని వేడుకొంటూ, వరుణిడి కటాక్షం కొరకు ప్రార్థిస్తున్నారు.

దాడి ఘటనలో ఇరువర్గాలపై కేసు నమోదు

క్రోసూరు: మండలంలోని దొడ్లేరు గ్రామంలో గురువారం చోటు చేసుకున్న రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు టి.హనుమంతరావుపై టీడీపీ నాయకుల దాడి ఘటనలో ఇరువర్గాలు చేసుకున్న ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.రవిబాబు శుక్రవారం తెలిపారు.

రోటరీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



పిడుగురాళ్ల రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు

పిడుగురాళ్ల: రోటరీ క్లబ్ ఆఫ్ లైమ్ సిటీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం శుక్రవారం నిర్వహించారు. పట్టణంలోని లైమ్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన అధ్యక్షుడిగా కోటా రమేష్‌బాబు, సెక్రటరీగా పచ్చిపులుసు పాపయ్య గుప్తా, ట్రెజరర్ ఊటుకూరి గురునాథం ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి డిస్ట్రిక్టు చైర్మన్ ఫర్ అన్యువల్ గివింగ్ కేఎస్ఆర్‌కే ప్రసాద్, డిస్ట్రిక్టు అవార్డు చైర్మన్ డాక్టర్ పి.విష్ణుబాబు, అసిస్టెంట్ గవర్నర్ జె.మురళి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అధ్యక్ష, కార్యదర్శులకు కాలర్ ప్రజెంటేషన్, చార్టర్ ప్రజెంటేషన్ అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా కేఎస్ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా పోలియో వ్యాధిని నిర్మూలించటంతో, సేవా రంగంలో రోటరీ చేస్తున్న సేవల గురించి వివరించారు. గత సంవత్సరం రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ చేసిన సేవలను గుర్తించి అవార్డ్స్ నైట్స్ కార్యక్రమంలో ఉత్తమ క్లబ్‌గా రిజనల్ పరిధిలో ఎన్నుకోవటం జరిగిందని ఈ సందర్భంగా తెలిపి అభినందించారు.

లోక్‌అదాలత్ విజయవంతం అభినందనీయం

సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు



కోర్టులో అధికారులను అభినందిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు

పిడుగురాళ్ల: ఇటీవల నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసి, ఎక్కు కేసులను రాజీ మార్గంలో పరిష్కారానికి కృషి చేసిన అధికారులను సీనియర్ సివిల్ జడ్జి వి.శ్రీనివాసరావు అభినందించారు. పట్టణంలోని సివిల్ జడ్జి కోర్టులో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, ఇన్‌చార్జి 10వ అదనపు జిల్లా జడ్జి శరత్ బాబు ఆదేశాలతో సీనియర్ సివిల్ జడ్జి వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 13న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని కూడా అందరూ విజయవంతం చేసేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు చల్లా రామిరెడ్డి, మందపాటి శ్రీనివాసరెడ్డి, షేక్ జానీ బాషా, కలివెల మరియదాసు, పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కుమారస్వామి, కనకం ఆదినారాయణ, బి.సుందర జ్ఞానమ్మ, జక్కా చెన్నకేశవులు, ఎం. ప్రసాదరావు, డి.లింగరాజు, కర్రా చిన కోటేశ్వరరావు, వై.నరసింహరెడ్డి, పి.బి.వి.సుబ్బమ్మ, చల్లా తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

రెండు వ్యవసాయ మోటార్ల చోరీ

రెంటచింతల: రెండు వ్యవసాయ మోటార్లు చోరీకి గురైన ఘటన గురువారం చోటుచేసుకుంది. రైతలుఉ తెలిపిన వివరాలు.. ఏడుమంగళంవాగు సమీపంలోని పంటపొలాల్లో రెంటచింతల గ్రామానికి చెందిన గాదె కార్తీక్‌రెడ్డి, యనిగండ్ల తులసమ్మకు చెందిన రెండు మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఇటీవల కాలంలో గ్రామానికి చెందిన దేవనబోయిన రాజు, ఏరువ శౌర్రెడ్డి, పంగులూరి పూర్ణయ్య, తన్నీరు అంజి, గోపు ఇన్నా రెడ్డి, శింగారెడ్డి ఆరోగ్యరెడ్డి, జడ్డు పాపిరెడ్డి, కొండాటి శ్రీనివాసరావు, గోపు రాయపురెడ్డి, అల్లం ఫాతిమా మేరి, ఏరువ రాజారెడ్డి, పుల్లా సుందరరాజు, కొమ్మారెడ్డి మర్రెడ్డి, శింగారెడ్డి ఆరోన్‌రెడ్డిమాలపాటి రాయపురెడ్డి, వెన్నా జోజిరెడ్డి, రెంటాల సర్వారెడ్డి పంట పొలాల్లో ఏర్పాటు చేసుకున్న మోటార్లకు సంబంధించిన కేబుల్‌వైర్లు చోరీకి గురైనట్లు అన్నదాతలు వాపోతున్నారు. పొలాల్లో రైతులు సాగునీటి కోసం ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటర్లు, కేబుల్ వైర్లు చోరీకి గురవుతుండటంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

రామప్ప గుడిలో ప్రత్యేక పూజలు



చింతల రామలింగేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మాచర్ల రూరల్: పట్టణ సమీపంలోని జమ్మలమడకలోని చింతల రామలింగేశ్వర స్వామి(రామప్ప గుడి) దేవస్థానంలో శుక్రవారం గంగమ్మ తల్లి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ పూజారులు భువనగిరి తులసీరామ శర్మ నేతృత్వంలో విఘ్నేశ్వర, లక్ష్మీ గణపతి, గాయత్రి హోమాలు నిర్వహించారు. గంగాపార్వతి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కంభంపాటి యలమంద, తుమేపల్లి సత్యనారాయణ, పోలిశెట్టి చంద్రశేఖర్ రావు, పందిరి సాంబశివరావు, ప్రకాశరావు, వెంకటేశ్వరరెడ్డి, నాగేశ్వరరావు, కనక వాసు, శివపార్వతి, తుమ్మేపల్లి మంజుల, శ్రీలత అరుణ, కొత్త కుమారి, విడేల ఉషారాణి పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణం పరిశీలన



సిమెంట్ రోడ్డును పరిశీలించిన పంచాయతీరాజ్ డెప్యూటీ ఈఈ వాణినాథ్

పెదకూరపాడు: జిల్లా పరిషత్ నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్డు, గ్రావెల్ రోడ్లను పంచాయతీరాజ్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వాణినాథ్ శుక్రవారం పరిశీలించారు. మండలంలోని బుచ్చయ్యపాలెం గ్రామంలో సుమారు మూడున్నర కిలోమీటర్లు పొలాలకు వెళ్లేందుకు రోడ్లు సక్రమంగా లేక, ఇరువైపులా పిచ్చి చెట్లు పెరిగి ఇబ్బందులు పడుతున్నామని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు రైతులు విన్నవించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ప్రవీణ్ జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.30 లక్షలు గ్రావెల్ రోడ్లు, రూ.5 లక్షలు సిమెంట్ రోడ్డు నిర్మాణానికి మంజూరు చేయించారు. కాంట్రాక్టర్ సిమెంట్ రోడ్డు, గ్రావెల్ రోడ్ల పనులను వేగవంతం చేశారు. శుక్రవారం పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ వాణినాథ్, పంచాయతీ ఏఈ డి.రమేష్ బాబుతో కలిసి రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు పొలాలకు వెళ్లేందుకు రోడ్లు సక్రమంగా లేక ఇబ్బందులు పడ్డామని, ఈ రోడ్డు వేయడం ద్వారా ఎంతో ఉపయోగపడుతుందని డిప్యూటీ ఈఈ వాణినాథ్‌కు, రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే ప్రవీణకు కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులను వాణినాథ్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వి.త్రిలోక్ రెడ్డి, పి.సుష్మ , బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు, రైతులు ఉన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్



మాదల(ముప్పాళ్ళ): స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని వ్యతిరేకించాలని కోరుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని మాదల గ్రామంలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ ప్రజలతో మాట్లాడుతూ మీ ఇంటిలో బాగున్న మీటర్లను తొలగించి ఆదానీ కంపెనీ స్మార్ట్ మీటర్లను బిగించడానికి వస్తున్నారని ముందస్తు అనుమతి లేకుండా మోసపూరిత మాటలు చెప్పి బెదిరించి స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని జాగ్రత్తగా ఉండాలన్నారు. మీటర్లను బిగించి పగలు ఒక రేటు, రాత్రికి ఒక రేటు వచ్చే విధంగా చేసి భారీగా బిల్లులు పెంచడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గారా జాలయ్య, కందిమళ్ల సాంబశివరావు, ఇందూరి సత్యనారాయణరెడ్డి, చింతపల్లి నాగమల్లేశ్వరరావు, గుంటుపల్లి రజిని, ధరణికోట విమల, కంచర్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైతు సంఘ నాయకుడు హనుమంతరావుపై దాడి దుర్మార్గం

అమరావతి: రైతుల పక్షాన పోరాడే రైతు సంఘం నాయకుడు తిమ్మిశెట్టి హనుమంతరావుపై టీడీపీ నేత దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మండల సీపీఎం కార్యదర్శి బి.సూరిబాబు అన్నారు. శుక్రవారం ఆయన సీపీఎం కార్యాలయంలో మాట్లాడుతూ దొడ్లేరు గోదావరి చైతన్య బ్యాంకులో గోల్డ్ రుణాలు తీసుకున్న రైతులను బ్యాంక్ అధికారులు, గోల్డ్ అడ్వైజర్ కుమ్మక్కై మోసం చేసిన నేపథ్యంలో గోల్డ్ బాధితులతో కలిసి రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం బ్యాంకు వద్ద చేపట్టిన ఆందోళనలో పాల్గొని దొడ్లేరు నుంచి క్రోసూరు వస్తున్న తిమ్మిశెట్టి హనుమంతరావు ద్విచక్ర వాహనాన్ని ఆపి క్రోసూరు టీడీపీ అధ్యక్షుడు మొగల్ జానీ, అతని సోదరుడు సమీరు అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తూ దాడి చేయటం దారుణమన్నారు. ప్రజా సంఘాల నాయకులపై దాడులు చేస్తే టీడీపీకి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. ఇద్దరిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని కోరారు. నిరసన హక్కు రాజ్యాంగం కల్పించిందని దొడ్లేరు గ్రామం మొగల్ జానీ జాగీర్ కాదన్నారు. నిందితులను అరెస్ట్ చేసి బాధితుడు హనుమంతరావుకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు మొహిద్దీన్, రాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

పిడుగురాళ్ల: పట్టణంలో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ ఎం.సైదారావు శుక్రవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

దాచేపల్లి మండలంలో...

దాచేపల్లి: సబ్ స్టేషన్‌ల పరిధిలో మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈలు ఏఈలు భగవాన్ నాయక్, నాగేశ్వరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కారెంపూడి మండలంలో...

కారెంపూడి: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈఈ జి వీరాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాచర్లలో..

మాచర్ల రూరల్: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.రామయ్య శుక్రవారం తెలిపారు. ఉదయం 9 నుంచి 2 గంటల వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు. మాచర్ల పట్టణ, గ్రామాలలోని కొప్పునూరు సబ్ స్టేషన్ పరిధిలోని కొప్పునూరు, అనుపు, బెల్లంకొండవారి పాలెం, చింతలతండా, అలుగురాజుపల్లి, బోదనంపాడులో విద్యుత్ ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పిడుగురాళ్ల: పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన మహిళ గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పట్టణ ఎస్ఐ శివనాగరాజు తెలిపారు. వివరాలు.. మారుతీనగర్‌కు చెందిన బత్తుల అంజలి(56) అనారోగ్యంతో గత నెల 12వ తేదీ ఆత్మహత్యాయత్నం చేసింది. బంధువులు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అంజలి మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

విద్యుత్ అదాలత్‌కు 11 సమస్యలు

సత్తెనపల్లి: విద్యుత్ వినియోగదారుల వద్దకే వచ్చి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని ఏపీసీపీడీసీఎల్ సీజీఆర్ఎఫ్ చైర్మన్, రిటైర్డ్ జిల్లా అండ్ సెషన్స్ జడ్జి ఎస్.విక్టర్ ఇమ్మానియేల్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో భాగంగా పట్టణ ఐదులాంతర్ల సెంటర్‌లోని ఎంవీఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు వారి వద్దకే రావడం జరుగుతుందన్నారు. ప్రధానంగా ప్రతి నెల రెండు ప్రాంతాలకు వెళ్లి ఆ ప్రాంతాల్లో విద్యుత్ వినియోగదారుల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఎలాంటి విద్యుత్ సమస్య ఉన్నా, బిల్లుల్లో తేడాలు ఉన్నా అదాలత్ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. సత్తెనపల్లిలో చేపట్టిన విద్యుత్ వినియోగదారుల అదాలత్‌కు 11 సమస్యలు రాగా ఆరు సమస్యలను వెంటనే పరిష్కరించామన్నారు. మరో ఐదు సమస్యలకు గడువు కేటాయించామని, గడువులోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఫైనాన్స్ మెంబర్ ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, టెక్నికల్ మెంబర్ ఎం.శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా ఎస్ఈ డాక్టర్ పత్తిపాటి విజయ్‌కుమార్, మాచర్ల డీఈ సింగయ్య, సత్తెనపల్లి ఏడీఈ రాజశేఖర్ బాబు, డివిజన్ పరిధిలోని ఇంజినీర్లు, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గరుడ వాహన సేవ



సత్తెనపల్లి: పట్టణ రైల్వేస్టేషన్ రోడ్‌లోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురుపౌర్ణమిని పురస్కరించుకొని శ్రీవారికి స్నపన తిరుమంజనం శోభాయమానంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ శ్యాము ఆచార్య రామానుజ దాసన్ మండపంలో వేంచేసి ఉన్న గరుడాళ్వార్ మూర్తికి విశేష పూజలు నిర్వహించారు. జ్ఞానవైరాగ్య ప్రాప్తికి గరుడిని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తుల విశ్వాసం. సర్వాలంకార భూషితుడైన శ్రీవారు గరుడ వాహనంపై సత్తెనపల్లి పుర వీధులలో గురువారం రాత్రి భక్తులకు అభయప్రదానం చేశారు. ఏకాంత సేవ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గరుడ ముద్ద, తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీవారి సేవా సమాజం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆరోగ్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి

దాచేపల్లి: ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఎక్కువ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే వారూ, హై రిస్క్ గ్రూప్‌లకు చెందిన వ్యక్తులు తప్పనిసరిగా హెపటైటిస్ బీ, సీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని రీడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కోమలి తెలిపారు. ఈ పరీక్షల ద్వారా నెగటివ్ ఫలితం వచ్చినవారికి వెంటనే హెపటైటిస్ బీ వ్యాక్సిన్ ఇవ్వబడుతుందని, పాజిటివ్ వచ్చినవారికి తగిన చికిత్సలు అందించబడతాయని పేర్కొన్నారు. దాచేపల్లి పట్టణంలోని రీడ్స్ కార్యాలయంలో పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఏపీ ఎస్ఎచ్ఎస్ఎస్, హెచ్ఐవీ నియంత్రణ సమీకృత వ్యూహం దిశలో, హై రిస్క్ గ్రూప్‌లకు హెపటైటిస్ బీ, సీ నిర్ధారణ పరీక్షలు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ కోమలి మాట్లాడుతూ హెచ్ఐవీతో పాటు ఇతర వైరల్ ఇన్‌ఫెక్షన్లు అరికట్టడంలో హెపటైటిస్ నిర్ధారణ పరీక్షలు తప్పనిసరి అని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం బి. యలమంద దమ్మ, అవుట్ రీచ్ వర్కర్ కోటేశ్వరి, పీర్ ఎడ్యుకేటర్ గీతా పాల్గొన్నారు.

మాచర్ల- కర్నూలు బస్సు పునరుద్ధరించాలని వినతి



డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి

మాచర్ల రూరల్: మాచర్ల డిపో నుంచి కర్నూలుకు బస్సు సర్వీసు పునరుద్ధరించాలని పలువురు విన్నవించారు. శుక్రవారం స్థానిక ఏపీఎస్ఆర్టీసీ డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమంలో డీఎం బత్తుల వీరాస్వామి నిర్వహించారు. పల్నాడు ప్రాంతం నుంచి రాయలసీమ ప్రాంతానికి వెళ్లే మాచర్ల-కర్నూలు బస్సును కొన్ని నెలల నుంచి ఆదాయం రావటం లేదనే కారణంతో బస్సును నిలుపుదల చేసినట్లు గుర్తు చేశారు. మాచర్ల నుంచే కాకుండా గురజాల, దాచేపల్లి, రెంటచింతల, కారంపూడి, యర్రగొండపాలెం, నందికొట్కూరు, దోర్నాల, కుంట తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున డీఎంకు ఫోన్‌లు చేసి బస్సును పునరుద్దరించాలంటూ విన్నవించినట్లు డీఎం చెప్పారు.. కర్నూలు బస్సు కోసం 33 మంది ప్రయాణికులు ఫిర్యాదు చేయటం గమనార్హం. దీని పై డిఎం వీరాస్వామి ఉన్నతాధికారులకు నివేదించి బస్సు పునరుద్ధరణ కృషి చేస్తానని చెప్పారు.

ఘనంగా ఈయూ ఆవిర్భావ దినోత్సవం



ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మాట్లాడుతున్న శివయ్య

మాచర్ల రూరల్: కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అలుపెరగని పోరాటం చేసి ఎన్నో విజయాలు సాధించిన ఘనత ఎంప్లాయీస్ యూనియన్‌కే దక్కుతోందని సంఘం జిల్లా జాయింట్ సెక్రెటరీ పీవీ శివయ్య పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన ఆర్టీసీలోని డ్రైవర్, కండక్టర్లు, మెకానిక్‌లు కిందిస్థాయి సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం యూనియన్ యాజమాన్యంపై సుదీర్ఘ పోరాటాలు చేసి ఎన్నో హక్కులను సాధించుకున్నామని చెప్పారు. కార్మికులంతా ఐక్యంగా ఉంటే మరిన్ని సమస్యలను పరిష్కరించుకోవచ్చునన్నారు. యూనియన్ ఏర్పడి 74 సంవత్సరాలు పూర్తి చేసుకోవటం ఎంతో గొప్ప విజయమని, రానున్న వజ్రోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. డిపో అధ్యక్షుడు నక్కా నీలంరాజు అధ్యక్షత న నిర్వహించిన కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు గుంజా చిన్నయ్య, చీఫ్ అడ్వైజర్ ఎస్ఎస్ రావు, డిపో కార్యదర్శి ఎంవీకే చారి, గ్యారేజి అధ్యక్ష, కార్యదర్శులు అప్పారావు, ఎ.సాగర్ బాబు, సహాయ కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు, కోశాధికారి ఎం.సురేష్ పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

అనుగురాజు యాదవ్ విగ్రహ స్టిక్కర్ల ఆవిష్కరణ



స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు జంగా కోటయ్య

పిడుగురాళ్ల: పట్టణంలోని గంగమ్మ తల్లి దేవాలయం ప్రాంగణంలో అనుగురాజు యాదవ్ విగ్రహ స్టిక్కర్లును స్థానిక జెడ్పీటీసీ జంగా కోటయ్య శుక్రవారం ఆవిష్కరించారు. పల్నాడు రాజ్య స్థాపకుడు అనుగురాజు యాదవ్ విగ్రహ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. త్వరలో అనుగురాజు యాదవ్ విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. కార్యక్రమంలో యాదవ సేవా సమితి అధ్యక్షుడు ఆవులు జనార్ధన్‌రావు మాస్టారు, దేవస్థాన నిర్వాహకులు కొక్కెర కొండలు, అనుగురాజు విగ్రహ ఏర్పాటు కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడు మేకల రాంబాబు పాల్గొన్నారు.

నవధాన్య సేద్యంతో భూమి సారవంతం



దొడ్లేరులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన శిక్షకులు సైదయ్య

క్రోసూరు: మండలంలోని దొడ్లేరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న రైతులు షేక్ హజరాబి, గౌస్ సంధాని వ్యవసాయ క్షేత్రాలను జిల్లా ప్రకృతి వ్యవసాయ శిక్షకులు సైదయ్య సందర్శించారు. ఈ సందర్భంగా సైదయ్య మాట్లాడుతూ ఇరువురు రైతులు మే చివరి వారంలో నవధాన్యాల సేద్యం (పీఎండీఎస్)లో ఆహార, పప్పుధాన్యాలు, నూనె గింజలు, సుగంధద్రవ్యాలు, పచ్చిరొట్ట విత్తనాలు, ఆకుకూరలు, కూరగాయలు, తీగ, దుంప జాతి మొక్కలు వేయడం జరిగిందన్నారు. దీనివల్ల ప్రధానంగా రైతులకు దిబ్బ ఎరువులపై వెచ్చించే ఖర్చు పూర్తిగా తగ్గుతుందని, అంతేకాక భూమిలో వివిధ రకాల సూక్ష్మజీవులు, శిలీంద్రాలు చేరడం వల్ల భూమి సారవంతమవుతుందని అన్నారు. రైతు తర్వాత వేయబోయే ప్రధాన పంటకు ఉపయోగించే రసాయన ఎరువుల వినియోగం తగ్గించుకోవచ్చని, పంటకు చీడపీడలను తట్టుకునే శక్తి, భూమికి పంట ఉత్పాదక శక్తి, నీటిని పట్టి ఉంచే గుణం పెరుగుతుందన్నారు. కావున మిరప, కంది, వరి, కూరగాయలు వివిధ రకాల పంటలు వేసే ప్రతి రైతు ఈ ప్రకృతి వ్యవసాయ విధానంలో పీఎండీఎస్ విధానాన్ని ఆచరించాలని కోరారు. కార్యక్రమంలో సావిత్రి, అరుణ షహనాజ్, షేక్ బాజీబీ, స్వయం సహాయక సంఘం మహిళలు, రైతులు పాల్గొన్నారు.

6 నుంచి పిల్లలకు ఫ్లోరోసిస్ పరీక్షలు చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ గిరిధర్‌కుమార్

రాజుపాలెం: ఫ్లోరోసిస్ వ్యాధి భూగర్భ జలాలు, ఆహార పదార్థాలు, టీ, కాఫీ, టూత్ పేస్టులలో ఎక్కువగా ఉంటుందని పల్నాడు జిల్లా కన్సల్టెంట్ ఎన్సీడీ డాక్టర్ గిరిధర్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాజుపాలెం, చెంద్రాజుపాలెం ప్రాథమిక కేంద్రాల కమ్యూనిటీ హెల్త్ అధికారులకు శుక్రవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో డాక్టర్ గిరిధర్‌కుమార్ మాట్లాడుతూ ఫ్లోరోసిస్ వలన పిల్లల దంతాలు పసుపు రంగులోకి మారడం, కీళ్లను ప్రభావితం చేయడం జరుగుతుందని తెలిపారు. 6 నుంచి 16 ఏళ్లలోపు పిల్లందరికీ ఫ్లోరోసిస్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రవితేజనాయక్, కమ్యూనిటీ హెల్త్ అధికారి వసంతరావు, అలేఖ్య, లక్ష్మీదుర్గా, శివమాధవి, ప్రియదర్శిని, హన్నాకుమారి, జ్యోత్స్న, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

రాజుపాలెం: ప్రతి విద్యార్థి వ్యక్తిగత శుభ్రతను పాటించాలని కోటనెమలిపురి ప్రభుత్వ ఆయుర్వేదిక్ డాక్టర్ కోటా శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రంలోని బీసీ వసతి గృహాలలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేల్పూరి అమ్మా చారిటబుల్ ట్రస్ట్ (తెనాలి) వారు విద్యార్థులకు భోజనం ప్లేట్లను శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. హాస్టల్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వార్డెన్ రవిబాబు, హెల్ప్ ఫౌండేషన్ అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, టీచర్ మస్తాన్, ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.